www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 11 ఏప్రిల్ 2024 8 పేజీలు





ఏలూరు పశ్చిమ గోదావరి



తణుకు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్

అవినీతి మంత్రికి బుద్ధి చెప్పండి

టిడిఆర్ బాండ్స్‌లో రూ.850 కోట్ల అతిపెద్ద అవినీతి

2014 తరహాలో అన్ని స్థానాల్లో గెలిపించండి

తణుకు సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

టిక్కెట్ దక్కని జనసేన అసంతృప్త నేత విడివాడ రామచంద్రరావు అనుచరులు ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, తణుకు, తణుకు రూరల్

అవినీతి మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు బుద్ధి చెప్పాలని, ఆయన అవినీతిలో పెద్ద ముదురు అని, టిడిఆర్ బాండ్స్‌లో రూ.850 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, రైతులను ఏడ్పించిన వైసిపి ప్రభుత్వాన్ని, మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్నికల్లో తుడిచిపెట్టేయాలని టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల ప్రచార సభ బుధవారం సాయంత్రం తణుకులో నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఇరు పార్టీల అధినేతలు హెలీకాప్టర్‌లో తణుకు పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఇరువురు నేతలు రోడ్డుషో నిర్వహిస్తూ సాయంత్రం ఆరు గంటలకు నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ముందుగా టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ, బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాసవర్మ మాట్లాడారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వంటి ముదురును రాజకీయ జీవితంలో చూడలేదన్నారు. ఇళ్ల స్థలాలను వీరే అమ్ముతారన్నారు. ఇళ్లస్థలాల కోసం రూ.30 వేలు చొప్పున వసూలు చేశారన్నారు. స్థలాల పూడికకు డబ్బు వసూలు చేయడం దారుణమన్నారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యం రవాణా, ఏ బిల్డింగ్ నిర్మించాలన్నా కారుమూరి ట్యాక్స్ కట్టాల్సి వస్తుందన్నారు. దీనిపై ప్రశ్నించిన జనసేన కార్యకర్తపై దాడి చేశారన్నారు. పవన్ కన్నెర్ర చేస్తే కారుమూరి ఎక్కడ ఉంటారన్నారు. టిడ్కో ఇళ్లు ఒక్కటీ ఇవ్వలేదన్నారు. గోనె సంచులు ఇవ్వలేని, ధాన్యం కొనలేని మంత్రిని ఏమనాలో మీరే తేల్చాలన్నారు. సదరు మంత్రికి బుద్ధి చెప్పాలన్నారు. రైతులు, రైతు పిల్లలు వైసిపి ప్రభుత్వాన్ని ఓడించే విధంగా పనిచేయాలన్నారు. పొత్తులో భాగంగా అందరికీ సీట్లు రాలేదని, త్యాగం చేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సీట్ల విషయంలో అందరం తగ్గాల్సి వచ్చిందన్నారు.

బూతులు తిట్టే మంత్రిని గోస్తనీలో కలిపేయాలి : పవన్‌కళ్యాణ్

తణుకులోని మంత్రి గురించి ..6లో

ఉడుకుతున్న ఉండి..!

- టిడిపి అభ్యర్థి రామరాజు మార్పుపై ఆగ్రహావేశాలు
- నియోజకవర్గంలో 1400 మంది తెలుగు తమ్ముళ్లు రాజీనామా
- టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మికి 40 పేజీల పత్రాలు అందజేత
- రఘురామకృష్ణంరాజుకు టిక్కెటిస్తే సహించబోమని స్పష్టీకరణ
- ఎంఎల్ఎ రామరాజు రాజకీయ ప్రయాణంపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - భీమవరం

టిడిపికి కంచుకోటగా పేరొందింది ఉండి నియోజకవర్గం. అటువంటి కోటలో టిక్కెట్ల రగడ తారాస్థాయికి చేరింది. సిట్టింగ్ మరొకరికి టిక్కెట్ కేటాయించారనే ప్రచారంపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు 1400 మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేసి 40 పేజీల రాజీనామ పత్రాలను టిడిపి జిల్లా అధ్యక్షులకు అందజేశారు. ఎంపీ రఘురామకృష్ణంరాజుకు టిక్కెట్ కేటాయిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉండి రాజకీయం అత్యంత ఆసక్తికరంగా మారింది.



ఉండిలో దీక్షల్లో పాల్గొన్న టిడిపి నేతలు

టిడిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి ఉండి నియోజకవర్గం కంచుకోటగా ఉంది. 2004లో మినహా మిగిలిన అన్నిసార్లు ఇక్కడ టిడిపి జెండా ఎగరేసింది. 2009, 2014లో రెండుసార్లు వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ఎంఎల్‌ఎగా పని చేశారు. ఆ తర్వాత జరిగిన 2019 ఎన్నికల్లో ఉండి నుంచి మంతెన రామరాజు (రాంబాబు) పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆ ఎన్నికల్లో శివరామరాజు నరసాపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ..6లో

15 నుంచి చేపల వేట నిషేధం

రెండు నెలలపాటు అమలు

ప్రజాశక్తి - నరసాపురం

నవంద్ర వ్ జలాల్లో ఈ నెల 15 నుండి జూన్ 14 వరకూ చేపల వేట నిషేధం అమలు చేస్తున్నట్లు నరసాపురం మత్స్యశాఖ సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ యంత్ర పడవలు, మెకనైజడ్, మోటారు బోట్ల ద్వారా జరిగే అన్ని రకాల చేపల వేటను 61 రోజులు పాటు ప్రభుత్వం నిషేధించిందన్నారు. చేపల పునరుత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా వచ్చే సంపద మరింత పెంపొందేందుకు ఈ నిషేధం విధించినట్లు తెలిపారు. మత్స్యకారులందరూ సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లఘించిన బోట్ల యజమానులకు ఎపి సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ-1994 చట్టాన్ని అనుసరించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోట్లు, బోట్లలోని మత్స్య సంపదను స్వాధీనం చేసుకుంటామన్నారు. జరిమానా విధించడం, డీజిల్ ఆయిల్‌పై రాయితీ, ఇతర సౌకర్యాలు నిలిపివేస్తామన్నారు.

14 డెడ్‌లైన్

మధ్యపేజీల్లో

ఉద్యమాలకు పుట్టిల్లు.. క్రీడలకు మెట్టినిల్లు

రామరాజు అభ్యర్థిత్వాన్ని కొనసాగించాలని దీక్షలు

8లో..

కృష్ణా నీటిని తాగునీటికే వినియోగించాలి

చెరువులకు నీటిని నింపడాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - కలిదిండి

జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్రమ నీటి వినియోగాన్ని నిరోధించేందుకు పటిష్టమైన నిఘా ఉంచాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన కలిదిండిలో చెరువుకు నీటిని నింపే విధానాన్ని పరిశీలించారు. అనంతరం రెండు రోజుల్లో నీరందనున్న పోల్‌రాజ్ కాల్వను ఆయన సందర్శించారు. కృష్ణా నది నుంచి వస్తున్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని 158 చెరువుల్లో నీరు నింపేందుకు విడుదల చేసిన కృష్ణా నీటిని సక్రమంగా వినియోగించుకునే విషయంలో రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మత్స్యశాఖాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తాగునీటి అవసరాలకు మినహా అక్రమంగా పొలాలకు, చేపలు, రొయ్యల చెరువులకు



కలిదిండిలో చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్

మళ్లించరాదని ఆయన స్పష్టం చేశారు. అనధికారికంగా మోటార్ల ద్వారా నీటిని తోడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం నూరుశాతం తాగునీటి అవసరాలకే కాల్వల నుండి వచ్చే నీటిని ఉపయోగించాలన్నారు. కాల్వల నుంచి సరఫరా అయ్యే నీటిని డ్రోన్ల ద్వారా పరిశీలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. క్యాంప్ బెల్ కాల్వకు సంబంధించి శివారు ప్రాంతాలకు నీరుచేరిన అనంతరం పై చెరువులకు నీటిని నింపడం ప్రారంభిస్తారన్నారు. దీని కింద 39 చెరువులకు నీటిని నింపే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. మళ్లీ రెండు నెలల వరకు కాల్వల నుంచి నీటి విడుదల ఉండదని, తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. కాల్వల్లో పైనుండి కొట్టుకొస్తున్న చెత్తా చెదారాలను తక్షణమే తొలగించాలని ఇరిగేషన్, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో ఉపాధిహామీ కింద తూడు తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ..6లో



నేడు రంజాన్

ముస్తాబైన మసీదులు

ప్రజాశక్తి - నరసాపురం


ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకునే రంజాన్ పండుగకు జిల్లాలో మసీదులు ముస్తాబయ్యాయి. ఆయా మసీదులు వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంజాన్ ఉపవాస దీక్షలు బుధవారం సాయంత్రంతో ముగిసాయి. బుధవారం సాయంత్రం పంజా సెంటర్ కోలాహలంగా కనిపించింది. మసీదులు, దర్గాలకు విద్యుద్దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తాగునీరందించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని ఆగడాల లంక సరస్సుకు చెందిన ఆవాస ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు అధికారులు బుధవారం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. దీని అమలు కోసం ఎంపిడిఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఏర్పడిన బృందం ఆయా ప్రాంతాల్లోని తాగునీటి చెరువులకు నీటిని తరలించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అంతకుముందు నీటిపారుదల శాఖ గత నెల 21-27వ తేదీల మధ్య ఆగడాల లంక ఛానల్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చింది. వివిధ కారణాలతో అనేక ఇబ్బందులు ఏర్పడి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న మండల ప్రత్యేక అధికారి, ఏలూరు ఆర్‌డిఒ సోమవారం నుంచి ఆగడాల లంక, చెట్టున్న పాడు, మల్లవరం గ్రామాల్లోని చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమస్యపై ఏలూరు డిఎల్‌పిఒ చంద్రశేఖర్ ఆ ప్రాంతాల్లో సందర్శించి తాగునీటి ఎద్దడి సమస్య గురించి ఆర్‌డిఒ దృష్టికి తీసుకువచ్చారు. ఇదేక్రమంలో కార్యక్రమ పర్యవేక్షణకు ఏర్పాటుచేసిన అధికారుల బృందం ఆగడాల లంక ఛానల్‌లో తూడు పెరిగిన కారణంగా నీరు ఎగువ ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేదని గుర్తించారు. ఉపాధి హామీ పనులతో వాటిని తొలగించేందుకు కొన్ని ఇబ్బందులు ఏర్పాటుతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వారి పరిధిలోని ఛానల్‌లోని తూడు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆగడాలలంక ఛానల్‌కు అక్రమంగా ఏర్పాటు చేసిన తూరల వల్ల ఛానల్‌కు వస్తున్న నీరు చేపల చెరువులకు తరలిపోతున్నట్లు గుర్తించి వాటిని మూసివేసేందుకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఛానల్ శివారుకు నీరు రాకపోవటంతో బృందం బుధవారం క్షేత్రస్థాయి తనిఖీలకు దిగింది. ఈ సందర్భంగా ఛానల్ నుంచి రోడ్డు దిగువగా పైప్ లైన్ వేసి అక్రమ విద్యుత్ కనెక్షన్ల ద్వారా విద్యుత్ మోటార్లతో, కొన్నిచోట్ల ఆయిల్ ఇంజన్లతో నీటిని తరలిస్తున్న కార్యక్రమాన్ని చూసి, మోటార్లకు విద్యుత్ కనెక్షన్ల తొలగింపుకు ఆదేశాలు జారీ చేశారు. కొన్నిచోట్ల మోటార్లను స్వాధీన పరుచుకున్నారు. రాత్రి సమయంలో చేపల చెరువులకు అక్రమంగా నీరు తరలించే అవకాశం ఉన్నందున వాటి నిరోధానికి గ్రామస్థాయి అధికారులు సభ్యులుగా గల బృందాన్ని తనిఖీల కోసం ఏర్పాటు చేశారు. ఈ విషయాలపై ఎంపిడిఒ, తహశీల్దార్‌ను వివరణ కోరగా తాగునీటి చెరువులకు అత్యవసరంగా తాగునీటిని సరఫరా చేయవలసి ఉన్న నేపథ్యంలో చెరువులు నింపేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి చెరువులు నింపే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.


పైపులైన్ల తొలగింపు కార్యక్రమం పర్యవేక్షిస్తున్న అధికారులు


సిపిఎం నాయకులతో హరికుమార్ రాజు

హరికుమార్ రాజు పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న పి.హరికుమార్ రాజు బుధవారం భీమడోలులో పర్యటించారు. ఈ సందర్భంగా అప్పటి కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుతం వివిధ పార్టీలలో ఉన్న ప్రముఖులు, పలువురు విశ్రాంత, ప్రస్తుత అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, సిపిఎం నాయకులు లింగరాజు, కట్టా భాస్కరరావు, జి.ప్రసాదరావు, ఎఫ్రాన్‌లను కలిశారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వవలసిందిగా వారికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా చేపట్టనున్న కార్యాచరణ ప్రణాళికపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ముసునూరు

ఎలక్షన్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఎన్‌ఫోర్స్‌మెంట్ దళాలు కవాతు నిర్వహించినట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో నూజివీడు డిఎస్‌పి జి.లక్ష్మయ్య, ముసునూరు ఎస్ఐ పి.వాసుల ఆధ్వర్యంలో స్పెషల్ బ్యూరో డిపార్ట్మెంట్ పోలీసులు గ్రామంలో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి రాజకీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు, గొడవలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరపాలని నిర్వహించేందుకు కవాతు జరిపినట్లు తెలిపారు.

వైసిపిలోకి పలువురు

నూజివీడు రూరల్: మండలంలోని జంగంగూడెం గ్రామంలో టిడిపికి చెందిన పలు కుటుంబాలు బుధవారం వైసిపి గ్రామ అధ్యక్షుడు పొట్లూరి అశోక్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైసిపిలోకి చేరారు. ఎంఎల్ఎ వారందరికీ వైసిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ సంక్షేమ పాలన, అభివృద్ధి చూసి ఇతర పార్టీల వాళ్లు వైసిపిలోకి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారధి ట్రస్ట్ ఆధ్వర్యాన కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలోని నాల్గవ వార్డ్ ఇందిరానగర్ కాలనీలోని ఆంజనేయ స్వామి వారి దివ్యసన్నిధిలో బుధవారం ఉదయం వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ నేతృత్వంలో ట్రస్ట్ ప్రతినిధులు స్థానిక సుశీలా హాస్పిటల్ డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు ద్వారా రూ.25 వేల వ్యక్తిగత వితరణతో 100 మంది లబ్ధిదారులకు కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వలవల తాతాజీ మాట్లాడుతూ తమ చిన్ననాటి మిత్రులు కాకర్ల రామచంద్రబాబు ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 9న నిర్వహించే స్వామి వారి వార్షికోత్సవంలో చేపట్టే ఉచిత నేత్ర వైద్య శిబిరంలో నిపుణులు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. ఈక్రమంలో ఈఏడు కూడా గౌతమి నేత్రాలయం రాజమండ్రి వారి ద్వారా ఎంపిక చేసిన 100 మందికి రూ.25 వేల విలువైన కళ్లజోళు లబ్ధిదారులకు పంపిణీ చేశామని తెలిపారు. కాకర్ల రామచంద్రబాబు స్నేహానికి ఇచ్చే విలువను తాతాజీ గుర్తుచేస్తూ తమ చిన్ననాటి మిత్రుల్లో మృతులైన మిత్రులిద్దరి ఆడబిడ్డలకు పూర్తి ఉచితంగా విద్యకు తోడ్పాటును అందిస్తూ తమ వంతు ఆదుకుంటున్నారని కాకర్ల రామచంద్రబాబు దాతృత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త కెఎల్ఎన్.ధనకుమార్, ట్రస్ట్ ప్రతినిధులు కలపాల శ్రీనివాసరావు, మద్దిపాటి శ్రీను పాల్గొన్నారు..


కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న రామచంద్రబాబు

మళ్లీ జగన్‌ను గెలిపించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, గోరుముచ్చు యాదవ్ అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు జరగాలంటే వైసిపి ప్రభుత్వం రావాలన్నారు. బుధవారం మండలంలోని శెట్టివారి గూడెం, నామవరం, పట్టాయిగూడెం గ్రామాలలో కంభం విజయరాజు పర్యటన కొనసాగింది. అనంతరం ప్రగడవరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి, వైసిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. నామవరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ కుటుంబాన్ని పరామర్శించారు. త్వరలో తమ కుటుంబానికి అన్ని విధాల న్యాయం జరిగే విధంగా తాను ముందుంటానని మాట ఇచ్చారు. నామవరం గ్రామ ప్రజలు చూపించిన అభిమానం, ఆప్యాయతను తాను జీవితంలో మర్చిపోలేనని, గ్రామంలో ఏ సమస్య ఉన్నా వాటిని త్వరలో పరిష్కరించి, ప్రజల శ్రేయస్సు కోసం తాను అహర్నిశలు పాటుపడతానని ప్రజలకు మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జగ్గవరపు జానకి రెడ్డి, జెడ్‌పిటిసి ములుగుమాటి నీరజ సుధాకర్, ఎంపిపి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ రాంబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, సిటీ మెడికల్ దుర్గారావు పాల్గొన్నారు.

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి విజయరాజు


మాట్లాడుతున్న విజయరాజు

కాంగ్రెస్ మండల అధ్యక్షురాలుగా సీత

ప్రజాశక్తి - పోలవరం



పోలవరం మండల కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ముచ్చిక సీత ఎంపిక పట్ల పోలవరం మండల కాంగ్రెస్ నాయకులు సంకురు బాబురావు, తోలేటి రఘు, మూర్తి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం దేవరగొంది పునరావాస కాలనీలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంకురు బాబూరావు నివాసం వద్ద పార్టీ మండల అధ్యక్షురాలు ముచ్చిక సీత అధ్యక్షతన కాంగ్రెస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముచ్చిక సీత మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించింది కాంగ్రెస్ అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ని బలోపేతం చేయడానికి, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ని గెలిపిస్తే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని తెలిపారు.

ముఖ్య వార్తలు

గురువారం 11 ఏప్రిల్ 2024



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

23 వరకు వాటర్ బెల్ కార్యక్రమం

ప్రజాశక్తి - కలిదిండి

పాఠశాల విద్యార్థుల్లో డీహైడ్రేషన్ నివారణకు రోజుకు మూడు సార్లు వాటర్ బెల్ కార్యక్రమం నిర్వహించాలని ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. మండలంలోని తాడినాడ జెడ్‌పిహెచ్ స్కూల్‌లో వాటర్ బెల్ విధానంపై అవగాహన కల్పించారు. మూత్రం రంగును బట్టి శరీరంలో నీటి లోపాన్ని గుర్తించాలన్నారు. తగినంత నీరు శరీరానికి అందితే మూత్రం లేత పసుపురంగు, లేత గోధుమరంగులో కాని ఏ రంగూ లేకుండా పారదర్శకంగా ఉంటుందన్నారు. ముదురు పసుపురంగు, తేనె రంగులో మూత్రం ఉంటే సరిపడా నీరు తాగాలని, ముదురు గోధుమరంగు అయితే వెంటనే ఎక్కువ నీరు తాగాలన్నారు. ఈనెల 23వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రమం తప్పకుండా వాటర్ బెల్ కార్యక్రమం కొనసాగించాలని ఉన్నత విద్యా శాఖాధికారులు ఆదేశించినట్లు ఎంఇఒ తెలిపారు.

ఆర్‌బికెల్లో పశువైద్య మందులు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని ఆర్‌బికెల్లో ప్రాథమిక పశువైద్యానికి సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. జిల్లాలో 537 ఆర్‌బికెలు ఉండగా అందులో పశువుల సంఖ్యను బట్టి 317 ఆర్‌బికె క్లస్టర్‌గా ఏర్పాటు చేసి పశువైద్య సహాయకులను శాశ్వత ప్రాతిపదికన నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా వీటి ద్వారా ఇందులో 2,900 మెట్రిక్ టన్నులు సమీకృత దాణా, 180 మెట్రిక్ టన్నుల విత్తనాలు, 85 దాఫ్ కట్టర్లు రైతులకు సరఫరా చేయడం జరిగిందని జెడి తెలిపారు. జిల్లాలో ఇంతవరకూ 1,757 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.

సెక్టార్ ఆఫీసర్లకు శిక్షణ

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 23 సెక్టార్ ఆఫీసర్లకు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు రిటర్నింగ్ అధికారి కార్యాలయం దెందులూరులో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కమిషనింగ్ ఆఫ్ ఇవిఎం ఈనెల 12వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రిసైడింగ్ అధికార్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఏలూరులో నిర్వహించు ట్రైనింగ్ క్లాసులో చెప్పవలసిన ముఖ్యమైన అంశముల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పోల్ డే మేనేజ్‌మెంట్ సిస్టమ్, పిడిఎంఎస్ ఆఫ్ గురించి తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు ప్రిసైడింగ్ అధికార్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికార్లు శిక్షణా కార్యక్రంలో ట్రైనింగ్ ఇవ్వడానికి సూచనలు ఇచ్చారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - ముసునూరు

చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి ప్రజలకు వివరించారు. ఆయన బుధవారం చాట్రాయి మండల పరిధిలోని జనార్దన వరం, ఆరుగొలను పేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిమిత్తం పర్యటించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500, ఆడబిడ్డ నిధి కింద ఇవ్వడం జరుగుతుందని వివరించారు.

తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపుకోవాలి

ఆర్‌డిఒ ఖాజావలీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

వేసవి ఎద్దడిని తట్టుకునే విధంగా మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ అన్నారు. మండలంలోని కాకరవాడ వద్ద సిబికెనాల్లో ప్రవహిస్తున్న కృష్ణానది నీటి వినియోగాన్ని ఆర్‌డిఒ బుధవారం అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది నుంచి వచ్చే నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలన్నారు. వ్యవసాయ, ఆక్వా చెరువుల అవసరాలకు ఈ నీటిని వినియోగించకూడదని, అనధికారికంగా మోటార్ల ద్వారా నీటిని తోడి ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాకరవాడలోని పంచాయతీ చెరువులోకి నీటిని పంపు చేసే విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వేసవి ఎద్దడిని తట్టుకునే విధంగా పంచాయతీ చెరువులను పూర్తిస్థాయిలో



సిబి కెనాల్‌లో నీటి వినియోగాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

నింపి మంచినీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, తదనుగుణంగా గ్రామ, మండల స్థాయిలోనూ టీములను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఆయన వెంట ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధర్ రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వివి.కృష్ణారావు, ఆర్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలుఉన్నారు.

'వృద్ధ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి'

ప్రజాశక్తి - టి.నర్సాపురం

వృద్ధ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి ప్రజానాట్యమండలి సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్ రాజు, సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమళ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని తిరుమల దేవి పేటకు చెందిన వృద్ధ కళాకారుడు తోట వెంకట్రావు(98)ను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యావత్ జీవితాన్ని రంగస్థలానికి అంకితం చేసిన వృద్ధ కళాకారుడు తోట వెంకట్రావు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి వృద్ధ కళాకారులను గౌరవించి రూ.25 లక్షల ఆర్థిక పారితోషికం అందించి ప్రతినెలా ఇస్తున్న నెలకు రూ.5 వేల మాదిరిగా రాష్ట్రంలో వృద్ధ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించి, తోట వెంకటరావు లాంటి వృద్ధ కళాకారులకు అమలు చేయాలని ఎపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని డిమాండ్ చేశారు. తోట వెంకటరావు తన 20 సంవత్సరాల నుంచి కళా రంగంలో రంగస్థలంపై అడుగుపెట్టి, గత రెండు సంవత్సరాల క్రితం వరకు కూడా ఆయన కంఠ ధ్వనితో తెనాలిలోకి సంగీతాన్ని ఆలపించి ప్రజలను మంత్రముగ్ధుల్ని చేసేవారన్నారు. వెంకట్రావు కళా వారసత్వాన్ని కుమారుడు తోట సత్యనారాయణ మనవడు తోట లక్ష్మీనారాయణలు సహితం కాపాడుకుంటూ పౌరాణిక నాటకాలలో తమ ప్రత్యేకతను చాటుతున్నారని అభినందించారు. వృద్ధ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ కన్వీనర్ శెట్టి నాగబాలాజీ పాల్గొన్నారు.

1,757 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జెసి బి.లావణ్య వేణి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రబీ పంటకు సంబంధించి ఇంతవరకూ 1,757 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. జిల్లాలో రబీ పంట కాలానికి సంబంధించి 120 ఆర్‌బికెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, అందుకు కావలసిన సౌకర్యాలు, సిబ్బందిని నియమించామన్నారు. కోతలు పూర్తి అయిన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చి షెడ్యులు చేయించుకొని ఈనెల 9వ తేదీన 150 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అందచేయగా, బుధవారం వరకు 108 మంది రైతులకు సంబంధించి 1,757 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో 44 మందికి చెందిన 302 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అనుసంధానం చేయబడిన రైస్‌మిల్లులకు ర్యాండమ్ సెలక్షన్ ద్వారా తరలించడం జరిగిందన్నారు. కావున రైతులందరూ తమ ధాన్యం కోతలు అయిన తర్వాత ఆరపెట్టుకొని సుమారుగా తేమశాతం 16 నుంచి 17 వరకు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ధాన్యంలో తాలు, తప్పలు మొదలైన వ్యర్థాలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకొని కనీస మద్దతు ధరకు అనగా క్వింటాలుకు కామన్ రకం రూ.2,183, గ్రేడ్ ఎ రకానికి రూ.2,203 బయోమెట్రిక్ విధానంలో తమ వేలిముద్రను వేసి ప్రభుత్వానికి విక్రయించుకోవచ్చన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. రైతులందరూ తమ తమ ధాన్యాలను ప్రభుత్వం కల్పించిన కనీసం మద్దతు ధర ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును నేటితరం యువత సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారి పిఒ సూర్యతేజ అన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశాలపై పోలవరం డిఎస్‌పి సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. కొయ్యలగూడెం ఎస్ఐ విష్ణువర్ధన్ వారి సిబ్బంది, సాయుధ దళాలతో ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో మనకు మనం పరిపాలించుకోవడానికి ఏర్పాటు చేయబడిన శాసన సంబంధ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి, మన



అవగాహన కల్పిస్తున్న పిఒ సూర్యతేజ

ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి ఈ ఓటు హక్కు ఎంతో దోహదపడుతుందన్నారు. రానున్న భావితరాల వారికి ప్రజాస్వామ్యం విలువలను, ఫలాలను అందించాలంటే ప్రతి ఒక్కరూ వారికి ఉన్న ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ అశోక్, పోలవరం సిఐ ఎం.మధు బాబు, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గేదెలకు కుక్కకాటు : తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ముసునూరు

కుక్కలు మనుషులను చంపడమే కాకుండా తమ బరువుకు మించిన గేదెలను కూడా కుక్కకాటుకు బలి చేస్తున్నాయని ముసునూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ముసునూరు గ్రామంలోని ఎస్‌సి ఏరియాలో సుమారుగా ఐదు గేదెలను కుక్కలు కాటు వేయగా, వాటిలో కొన్ని గేదెలు ప్రాణాప్రాయ స్థితిలో వున్నాయని, మరికొన్ని తీవ్రగాయాలపాలయ్యాయని పశువుల కాపరి తెలిపారు. గతంలో రెండు గొర్రెలు, కోడి పుంజులు కుక్కు కాటుకు గురై చనిపోవడంతో, ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో తెలియక దిక్కు తోచని స్థితిలో వున్నామని పశు వుల కాపరి వాపోయారు. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని వారు కోరారు.




గాయపడిన గేదెను చూపిస్తున్న కాపరి

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని మెట్టగూడెంలో ప్రభుత్వం నిషేధించిన నాటుసారాను తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి మహిళను అరెస్టు చేశారు. ఆమెవద్ద నుంచి పది లీటర్ల నాటుసారా స్వాధీన పరుచుకుని చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.



ప్రచార కార్యక్రమంలో ముద్దరబోయిన

చంద్రబాబు నమ్మించి మోసం చేశారు

స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గంలో కష్టపడి పార్టీని బలోపేతం చేసిన తనకు టికెట్‌ను చంద్రబాబు నిరాకరించడమే తనకు చేసిన అన్యాయమని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆగిరిపల్లి మండలంలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఎస్ఎ పేట, పిన్నమరెడ్డిపల్లి, నూగుండపల్లి గ్రామాలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బే ప్రధానంగా రాజకీయాలు మారాయని, గత రెండు సందర్భాలలో నూజివీడు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి ఇంటికి ముద్దరబోయిన వెళ్లాడన్నారు. టిడిపి కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్రంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచింది, ఇకనుంచి నువ్వే గెలుస్తావని పలు సందర్భాలలో చంద్రబాబు అనేక వేదికల నుంచి అభ్యర్థిగా ప్రకటించి చివరికి వైసిపి నుంచి పార్థసారధిని తీసుకువచ్చి ఇక్కడ నిలబెట్టారన్నారు. తనను నమ్మి ఇక్కడ రాజకీయాల్లో ఉన్న తన కార్యకర్తలను వదిలి వెళ్లే ప్రసక్తి లేదని, అందుకే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ప్రతి కార్యకర్త అండగా నిలిచి ఓట్లు వేయించగలిగితే నియోజకవర్గంలో ధన ప్రవాహాన్ని ఎదుర్కొని ముద్దరబోయిన గెలవడం ఖాయం అన్నారు. గత పది సంవత్సరాలలో నూజివీడు నియోజకవర్గంలో నిస్వార్థ రాజకీయాలను నడిపానని, ఎక్కడా తాను అవినీతికి పాల్పడలేదన్నారు. తాను ఎన్నిక కాకపోయినా ఇక్కడ ఇన్‌ఛార్జిగా నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసానన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా నూజివీడు నియోజకవర్గం నుంచి ఎన్నిక అయితే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని, గెలిపించాలని కోరారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

నరసాపురం వైసిపి ఎంపీ అభ్యర్థి ఉమాబాల



ప్రజాశక్తి - భీమవరం రూరల్

నరసాపురం పార్లమెంట్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. స్థానిక ప్రొగ్రెస్ జూనియర్ కళాశాలలో విలేకర్ల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమా బాల మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్‌లో ఎప్పుడూ ఆర్థికంగా, సామాజికంగా బలమైన అభ్యర్థులకే కేటాయించిన ఈ సీటు ఎన్నడూలేని విధంగా జగన్మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించాలనే సంకల్పంతో బిసి మహిళనైన తనకు ఎంపీగా పోటీ చేసే అవకాశాలు కల్పించారని తెలిపారు. గతంలో ఎంపీగా పోటీ చేసి గెలిచిన నాయకులు ఈ ప్రాంతాన్ని వదిలి హైదరాబాద్, ఢిల్లీలో ఉండేవారన్నారు. రఘు రామకృష్ణంరాజు పార్టీ అధిష్టానంతో గొడవ పెట్టుకుని నాలుగున్నరేళ్లు నియోజకవర్గానికి దూరంగా ఉన్నారని, దీంతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. తాను గత నాయకుల్లా కాకుండా భీమవరం కేంద్రంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. తనకు సీటు ప్రకటించిన నాటి నుంచి జిల్లాలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలతోపాటు ఇతర వర్గాల ప్రజల కూడా పూర్తి మద్దతు ప్రకటిస్తారని తెలిపారు. తాను ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రతి గ్రామంలోనూ అన్ని వర్గాల ప్రజలూ ముఖ్యంగా మహిళలు తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తున్నారన్నారు. ఇప్పటికే నరసాపురం పార్లమెంట్ పరిధిలో దాదాపు 80 శాతం పైగా ప్రచారం పూర్తి చేశానని, త్వరలో నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తన పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోని ఎంఎల్‌ఎలతో కలిసి ప్రచారం చేస్తామని తెలిపారు. లంకలకోడేరు ప్రాంతంలో తలపెట్టిన మెడికల్ కాలేజీ పూర్తిచేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రతి నాయకుడు, కార్యకర్తలను కలుపుకొని పార్లమెంట్లో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటామని తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎన్నికల ప్రచారంలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఆచంట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తరుపున ప్రజలు ఓట్లు అడిగే హక్కు వైసిపికి ఉందని ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం వల్లూరు గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబును ఈ ఎన్నికల్లో ప్రజలంతా చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. సిఎం జగన్ అవినీతి రహిత పాలన చేస్తూ సువర్ణపాలన అందించారన్నారు. మళ్లీ జగనన్న పాలన కావాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ చెల్లెం ఆనంద ప్రకాశ్, రాష్ట్ర క్రిస్టియన్ సంఘం నాయకులు మేడిది జాన్సన్, డేవిడ్ రాజు పాల్గొన్నారు.



ఆచంట : మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

జంగారెడ్డిగూడెం టౌన్ : మున్సిపల్ వైస్‌ఛైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణాధ్యక్షులు [illegible] ఆధ్వర్యంలో పట్టణంలోని 25వ వార్డులో ప్రచారం నిర్వహించారు. [illegible] గుర్తుకే ఓటు వేయాలని కోరారు. [illegible] మండలంలో విజయ సారథి, సోంబాబు బాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : వైసిపి తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరుతూ ఆయన కుమారుడు బాల రాజేష్, కుమార్తె కంచన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం ఐదో వార్డులో ప్రచారం నిర్వహించారు. తమ తండ్రి కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరారు. వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా అన్ని కుటుంబాలు ఆర్థికంగా లబ్ధి పొందాయన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పెద్ద ఎత్తున మహిళలు పార్టీలో చేరారు. ఈ ప్రచారంలో వార్డుల ఇన్‌ఛార్జులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మొగల్తూరు : నరసాపురం నియోజకవర్గాన్ని కోట్ల రూపాయలతో ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అభివృద్ధి చేశారని ఆయన తనయుడు శ్రీ కృష్ణంరాజు, అల్లుడు అడ్డూరి అనిల్ వర్మ అన్నారు. బుధవారం శేరేపాలెం గ్రామంలో ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, నాయకులు లోకం నాని పాల్గొన్నారు.

కొవ్వూరులో నాయకర్ ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తామని జనసేన ఎంఎల్‌ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. కొవ్వూరు గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన నాయకులు చాగంటి మురళీకృష్ణతో కలిసి జనసేన ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాతాడి ఉమా, పోలిశెట్టి సతీని, అంబటి అరుణ పాల్గొన్నారు.

గ్రామాల్లో శివ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కాళ్ల

నియోజకవర్గంలో ఎంఎల్‌ఎగా పనిచేసినప్పుడు గ్రామాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఈ ఎన్నికల్లో తాను గెలుపొందడానికి దోహదపడతాయని ఉండి నియోజకవర్గ స్వతంత్ర ఎంఎల్‌ఎ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని కోమటిగుంట, కోలనపల్లి గ్రామాల్లో శివరామరాజు ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. కోలనపల్లి గ్రామంలో శివరామరాజును గజమాలతో సత్కరించారు. ఈ ప్రచారంలో కలవపూడి సర్పంచి గేదెల జాన్, కాళ్ల సర్పంచి బందా విజయ, వేగేశ్న బాలగణపతి వర్మ, అల్లూరి అమృతరాజు పాల్గొన్నారు.

బిజెపిని సాగనంపాలి

కాంగ్రెస్ ఎన్నికల అబ్జర్వర్ మనోహర్ చౌహాన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వనని చెప్పి నమ్మకద్రోహం చేసిన బిజెపిని సాగనంపాలని అఖిల భారత కాంగ్రెస్ ఎన్నికల అబ్జర్వర్ మనోహర్ చౌహాన్, రాష్ట్ర పర్యవేక్షణ ప్రెసిడెంట్ సంకర పద్మశ్రీ పిలుపునిచ్చారు. భీమవరం కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ నాయకులతో పాటు నరసాపురం పార్లమెంటు పరిధిలోని ఆరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్ చౌహాన్ ఎన్నికల నియమావళి, ఓట్లు రాబట్టడం ప్రచారం ఎలా చేయాలనే దానిపై అభ్యర్థులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని దోచుకోవడానికి బిజెపి, టిడిపి, జనసేన పొత్తులు పెట్టుకున్నాయని విమర్శించారు. వీళ్ల దొంగ మాటలు నమ్మొద్దన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకుండా అడ్డుకోగలమని తెలిపారు. రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భీమవరం అసెంబ్లీ అభ్యర్థి అంకెం సీతారాం, పట్టణ అధ్యక్షులు టి.వంశీరెడ్డి, దుండి రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉద్యమాలకు పుట్టిల్లు.. క్రీడలకు మెట్టినిల్లు..


గోదావరి పరవళ్లు, ఆహ్లాదకర వాతావరణం
అపరిష్కృతంగా లంకవాసుల సమస్యలు

ఆచంట నియోజకవర్గ ముఖచిత్రం
నియోజకవర్గ పరిధి..
ఆచంట, పెనుమంత్ర, పెనుగొండ మండలాలతోపాటు పోడూరు మండల పరిధిలోని పోడూరు, కవిటం, గుమ్ములూరు, మినిమించిలిపాడు, తూర్పుపాలెం, పండితవిల్లూరు, పి.పోలవరం, జగన్నాథపురం గ్రామాలు. ఓటర్ల సంఖ్య: లక్షా 74 వేల 229 మంది ఓటర్లు



ప్రజాశక్తి - ఆచంట

పచ్చని పంట పొలాలు.. పుడమి తల్లికి వింజామరలు, పట్టినట్టుండే కొబ్బరి తోటలు.. గలగల పారే గోదావరి, దీవుల్లాంటి లంక గ్రామాలు.. ప్రసిద్ధ క్షేత్రాలు.. ఆహ్లాదకర వాతావరణం.. అన్నీ కలబోత ఆచంట నియోజకవర్గం. ఇక్కడి ప్రజలు పట్టణవాసులకు దీటుగా రాజకీయ చైతన్యంతో వ్యవహరిస్తుంటారు. జిల్లాలోనే కమ్యూనిస్టుల ప్రభావం కలిగిన నియోజకవర్గాల్లో ఇదొకటి. ఉద్యమాలకు పుట్టినిల్లుగా.. క్రీడలకు మెట్టినిల్లుగా బాసిల్లుతోంది.. చరిత్రలో ప్రసిద్ధికెక్కిన కాళీపట్నం పోరాటం.. వ్యవసాయ కూలీ ఉద్యమం... ఆకలి యాత్ర తదితర పోరాటాల్లో ఈ ప్రాంత వాసులు ప్రధాన భూమికను పోషించారు. ఉద్యమాల్లో అమరులైన ప్రేరేప మృత్యుంజయుడు, తాళ్ల బసవమల్లయ్య వంటి ధీరులందరూ పుట్టిన గడ్డ ఇది. రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఆచంట 1962లో ఏర్పడింది. 2009 పునర్విభజన అనంతరం నియోజకవర్గ స్వరూపమే మారిపోయింది. పెనుగొండ నియోజకవర్గం రద్దయి పెనుగొండ, పెనుమంత్ర, ఆచంట మండలాలతోపాటు పోడూరులో సగభాగంతో ఆచంట జనరల్ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఇప్పటివరకూ నియోజకవర్గంలో 13 సార్లు ఎన్నికలు జరగ్గా అన్ని ప్రధాన పార్టీలనూ గెలిపించి ఆచంట ఓటర్లు తమ వైవిధ్యాన్ని చాటుకున్నారు. ఇప్పటివరకూ ఒకసారి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ, మూడుసార్లు సిపిఎం, మూడుసార్లు టిడిపి, నాలుగు సార్లు కాంగ్రెస్ గెలుపొందాయి. 286 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గానికి తూర్పున వశిష్ట గోదావరి, పడమరన తణుకు నియోజకవర్గం, ఉత్తరాన ఎన్‌హెచ్-5 జాతీయ రహదారి, దక్షిణాన పాలకొల్లు నియోజకవర్గం సరిహద్దులుగా ఉన్నాయి. పెనుగొండలో ప్రసిద్ధిగాంచిన ఎస్‌వికెపి డిగ్రీ, పీజీ కళాశాలలు, ఆచంటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రయివేటు డిగ్రీ కళాశాల, పోడూరులో కల్నల్ డిఎస్ రాజు పాలిటెక్నిక్ కళాశాల, పెనుమంత్ర మండలంలో రెండు ప్రయివేటు డిగ్రీ కళాశాలలు, డైట్, బిఇడి, పిఇటి కళాశాలలు ఉన్నాయి. మార్టేరులోని వరి పరిశోధనా కేంద్రం రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తోంది. దేశంలోనే ప్రసిద్ధి గాంచిన వాసవీ



కన్యకాపరమేశ్వరి ఆలయం, వాసవీ ధామ్, ఆచంటలోని జైన్ దేవాలయం, పెదమల్లంలో మసేనమ్మ ఆలయం, ఆచంటలో రామేశ్వరస్వామి ఆలయం, పెనుమంత్ర మండలం నతారామేశ్వరంలో రామేశ్వరస్వామి, జుత్తిగలో సోమేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధి గాంచాయి.

క్రీడలకు స్ఫూర్తి..

క్రీడలకు, క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చే నియోజకవర్గంగా ఆచంట వెలుగొందుతోంది. పరుగుల రాణి సత్తి గీత ఈ ప్రాంతానికి చెందిన వారే. మార్టేరులో బాస్కెట్‌బాల్, ఆచంటలో వాలీబాల్ పోటీల్లో నియోజకవర్గానికి చెందిన పలువురు క్రీడాకారులు విజేతలుగా నిలిచారు.

ప్రస్తుత పరిస్థితి..

రాజకీయ చైతన్యం కలిగిన ఆచంట నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, టిడిపి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ మధ్య హోరాహోరీ పోరు సాగుతుండటంతో రాజకీయం వేడెక్కింది. అందరూ ఊహించినట్లుగానే ద్విముఖ పోటీ సాగనుండగా ఇద్దరు అభ్యర్థులూ ఇప్పటికే ప్రచారాలను ముమ్మరం చేశారు. గత ఎన్నికల్లో ఈ ఇద్దరి మధ్య ప్రధాన పోటీ జరగ్గా వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజును విజయం వరించింది. మరి ఈసారి ఎన్నికల్లో ఓటర్లు ఎటువంటి తీర్పు ఇస్తారో ఎదురు చూడాల్సిందే.

ఇరువురు రాజకీయ ఉద్దండులే..

రాజకీయంలో పితాని సత్యనారాయణ, చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇరువురు రాజకీయ ఉద్దండులే. ఇద్దరూ కాంగ్రెస్ మూలాలకు చెందిన వారే. బిసి సామాజిక తరగతికి చెందిన పితాని 1994లో రద్దయిన పెనుగొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి మొదటిసారి పోటీ చేసి ఓటమి చెందారు. 1999లో కూడా పోటీ చేసి ఓటమి చెందారు. 2004లో మరలా అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009లో డీలిమిటేషన్‌లో భాగంగా పెనుగొండ నియోజకవర్గం రద్దు కావడంతో పితాని సమీపంలోని ఆచంటకు వలస వచ్చారు. 2009లో ఆచంట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించడంతో వైఎస్ఆర్ హయాంలో మొదటిసారిగా ఆరోగ్య శాఖా మంత్రిగా పనిచేశారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమ శాఖ, ఆర్అండ్‌బి శాఖా మంత్రిగా పనిచేశారు. 2014లో కిరణ్‌కుమార్‌రెడ్డి స్థాపించిన సమైక్యాంధ్ర పార్టీలో చేరి చివరి నిమిషంలో టిడిపిలో చేరి ఆచంట నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. టిడిపిలో కార్మిక, ఉపాధి కల్పన శాఖా మంత్రిగా పనిచేశారు. 2019లో మరోసారి టిడిపి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.

క్షత్రియ సామాజిక తరగతికి చెందిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం కొనసాగారు. 2004లో అత్తిలి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి సీనియర్ నేత దండు శివరామరాజుపై విజయం సాధించారు. తరువాత చంద్రబాబు హయాంలో టిడిపిలో కొంతకాలం పని చేశారు. 2019 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఆచంట టిక్కెట్‌ను దక్కించుకుని పోటీ చేసి పితానిపై ఘనవిజయం సాధించారు.

గతంలో ఎన్నికల ఫలితాలు ఇలా..

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1962	పడాల శ్యాంసుందర్రావు	సిపిఐ	దాసరి పెరుమాళ్లు	కాంగ్రెస్
1967	దాసరి పెరుమాళ్లు	కాంగ్రెస్	డిఎస్.రాజు	సిపిఎం
1972	గొట్టుముక్కల వెంకన్న	కాంగ్రెస్	డిఎస్.రాజు	సిపిఎం
1978	కోట ధనరాజు	కాంగ్రెస్	డిఎస్.రాజు	సిపిఎం
1983	కోట భాస్కరరావు	టిడిపి	కోట ధనరాజు	కాంగ్రెస్
1985	అలుగు చిత్తరంజన్	సిపిఎం	కమిడి అంబుజ	కాంగ్రెస్
1989	దిగుపాటి రాజగోపాల్	సిపిఎం	కోట భాస్కరరావు	కాంగ్రెస్
1994	దిగుపాటి రాజగోపాల్	సిపిఎం	బుంగా సారథి	కాంగ్రెస్
1999	మోచర్ల జోహార్‌వతి	టిడిపి	బుంగా సారథి	కాంగ్రెస్
2004	పీతల సుజాత	టిడిపి	చెల్లెం ఆనంద ప్రకాష్	కాంగ్రెస్
2009	పితాని సత్యనారాయణ	కాంగ్రెస్	కర్రి రాధాకృష్ణారెడ్డి	టిడిపి
2014	పితాని సత్యనారాయణ	టిడిపి	ముదునూరి ప్రసాదరాజు	వైసిపి
2019	చెరుకువాడ శ్రీరంగనాథరాజు	వైసిపి	పితాని సత్యనారాయణ	టిడిపి



14 డెడ్ లైన్..

అటు ప్రభుత్వాలను నిలబెట్టాలన్నా.. ఇటు పడగొట్టాలన్నా నవ సమాజ నిర్మాణంతోపాటు ప్రజల భవిష్యత్తును సైతం మార్చగలిగే ఏకైక వజ్రాయుధం ఓటు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ఎంతో కీలకంగా మారింది. అయితే ఈ ఓటు హక్కు పొందేందుకు ఈ నెల 14వ తేదీతో గడువు ముగుస్తుంది. అదే రోజు సాయంత్రం నాటికి వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఒకపక్క అధికార యంత్రాంగం ఓటు హక్కు నమోదుకు అవగాహన కనిపిస్తున్నా ఎంతోమంది ఓటు నమోదుకు దూరమవుతున్న పరిస్థితి ఉంది.

ఓటు హక్కు నమోదుకు చివరి అవకాశం
14 తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి ఈసారి ఓటు వేసే హక్కుకు దూరమైనట్లే
అవగాహనా లేమితో నమోదుకు దూరమవుతున్న ఓటర్లు
కలెక్టరేట్లో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. అప్పటి నుంచి నామినేషన్ సేకరణ ప్రారంభమై 25వ తేదీలోపు ముగుస్తుంది. 26 నుంచి నామినేషన్ల ఉపసంహరణ ప్రారంభమై 29వ తేదీలోపు ముగియనుంది. మే 13న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఇటు అధికార యంత్రాంగంతో పాటు రాజకీయ పార్టీలు కూడా ఎన్నికలకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే ఎన్నికల పనుల్లో హడావిడిగా గడుపుతున్నారు. అయితే ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించే ఓటు హక్కు నమోదు కూడా కీలకపాత్ర పోషిస్తుంది. గతం నుంచి ఓటు హక్కుకు నిరంతరాయంగా అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటు నమోదుకు డెడ్ లైన్ విధించింది. ఈ నెల 14వ తేదీలోపు ఓటు నమోదుకు గడువు ముగియనుంది. తర్వాత చేసుకున్న దరఖాస్తులను ఎన్నికల తర్వాత పరిగణలోకి తీసుకుంటామే తప్ప ఈ ఎన్నికల్లో ఓటు వేసే హక్కు మాత్రం ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రచురణ కూడా జరిగింది. ఇప్పటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ వచ్చే కొత్త ఓటర్లను అనుబంధ (సప్లిమెంటరీ) జాబితాలో చేరుస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 14వ తేదీలోపు వచ్చే దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుని వాటిని పది రోజుల్లోగా పరిశీలించి, అర్హత ఉంటే ఓటర్ల జాబితాలో చేర్చడం జరుగుతుంది. తుదిజాబితా నాటికి ఏలూరు జిల్లాలో 16,24,416 మంది ఓటర్లతో పాటు గత నెల మార్చి 30వ తేదీ నాటికి పశ్చిమగోదావరి జిల్లాలో 14,61,377 మంది ఓటర్లు నమోదయ్యారు. రెండు జిల్లాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాల్లో మహిళా ఓటర్లు సంఖ్య 8,30,390 మంది కాగా, పురుష ఓటర్లు 7,93,897 మంది. పురుషుల కంటే మహిళల ఓట్లు 36,498 అధికంగా ఉన్నాయి. పశ్చిమలో మహిళా ఓటర్లు 7,44,308 మంది కాగా, పురుష ఓటర్లు 7,16,956 మంది ఉన్నారు. ఈ జిల్లాలో కూడా 27,352 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

అవగాహన అంతంత మాత్రమే .. పట్టించుకోని అధికారులు

ఓటరు జాబితాల పరిశీలనపై ఓటర్లు ఉదాశీనంగా వ్యవహరిస్తుంటారు. తమ ఓటు ఉందా? ఉంటే తమ పోలింగ్ బూత్‌లోనే ఉందా ? తమ కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే చోట ఉన్నాయా అన్న అంశాలను పరిశీలించుకోవాల్సి ఉంది. దీనిపై చాలా మందికి అవగాహన లేదు. సాధారణంగా ఓటు ఎక్కడ ఉందో బిఎల్‌ఒలు ఓటరుకు వివరించాలి. ఏదైనా తప్పిదం ఉంటే వారి చేత ఫారం-8 దరఖాస్తు పెట్టించి నివాస ప్రాంతానికి సమీప కేంద్రంలోకి మార్చేలా చూడాలి. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అయితే ఒక్కోసారి ఓటరులో అందుబాటులో లేకపోవడంతో అధికారులకు కూడా ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఓటర్లకు కూడా పూర్తిస్థాయిలో అవగాహన ఉండడం లేదు. అయితే అధికారులు పదేపదే అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రావట్లేదనేది తెలుస్తోంది. జిల్లా అధికారుల సమీక్షలో కూడా ఇది స్పష్టమైంది.

జాబితాలో పేరు లేకపోతే.. ఆందోళన వద్దు

ఓటరుగా నమోదైనప్పటికీ ఎన్నికల రోజున జాబితాలో చాలా మంది తమ పేర్లు లేవని ఆందోళన చెందుతూ ఉంటారు. దానికిబదులు ముందుగానే తమ పేరు చూసుకోవడం మంచిది. ఒక వేళ పేరు కనిపించకపోతే వెంటనే కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హతను పరిశీలించి అధికారులు ఓటేసే హక్కు కల్పిస్తారు. దీంతోపాటు చిరునామా మార్చుకునే అవకాశం ఉంది. దానికి ఫారం - 8ను వినియోగించాలి. 18 ఏళ్లు నిండినవారు ఓటరు హెల్ప్‌లైన్ యాప్, హెచ్‌టిటిపిఎస్, విఒటిఇఆర్‌ఎస్.ఇసిఐ.జిఒవి.ఐఎన్, వెబ్‌సైట్, హెచ్‌టిటిపిఎస్, సిఇఒఎఎన్‌డిహెచ్‌ఆర్‌ఎ. ఎన్ఐసి. ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఫారమ్-6లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే చిరునామా, ఓటు మార్పు కోసం ఫారమ్-8 ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలన పూర్తిచేసి, నిర్ణయం తీసుకున్న తర్వాత కొత్తగా ఓటుహక్కు పొందినవారి పేర్లను అనుబంధ జాబితా ద్వారా, అలాగే మృతి చెందిన వారు, బదిలీ ఓటర్ల వివరాలను ఎఎస్‌డి జాబితాలో నమోదు చేసి, ఆయా పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులకు అందజేయడం జరుగుతుంది. దీనికోసం కలెక్టరేట్‌లో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. కాల్ సెంటర్ 08816-299616, 08816-299617 నంబర్లను సంప్రదించి తమ ఓటు వివరాలను తెలుసుకునే అవకాశాన్ని జిల్లా యంత్రాంగం కల్పించింది.

ఎన్నికల్లో అధికారుల పాత్ర కీలకం

జెసి సివి ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - ఉండి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గస్థాయి పిఒలు, ఎపిఒలు అధికారుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సివి.ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ పిఒలు, ఎపిఒలు ఎన్నికల నిర్వహణకు సంబంధించి వారి విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వివరించారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ, ఎన్నికల ఓట్ల లెక్కింపు తదితర వాటి గురించి వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ అమర్చడంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

పోటీ చేసి గెలుస్తా..

రఘు రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పెనుమంత్ర

సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ నుంచి గానీ, పార్లమెంట్ నుండి గానీ పోటీ చేసి గెలుస్తానని వైసిపి రెబల్, ఎంపీ కనుమూరి రఘు రామ కృష్ణంరాజు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం జుత్తిగలోని ఉమా వాసుకీ రవి సోమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు వి.సత్యనారాయణ, జి.శ్రీనివాసరెడ్డి, కె.సోమభాస్కరరెడ్డి, వీరవల్లి రాంబాబు ఉన్నారు.

రోషన్ కుమార్‌పై దుష్ప్రచారం తగదు

ఎంసి మాజీ ఛైర్మన్ ముత్తారెడ్డి

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ను మారుస్తున్నారని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదని ఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి అభ్యర్థిగా రోషన్ కుమార్ పనితీరుపై చంద్రబాబు నాయుడు సంతృప్తిగా ఉన్నారని ఇటీవల నల్లజర్లలో జరిగిన సమావేశంలో వెల్లడించారని తెలిపారు. రోషన్‌కు వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీ వస్తుందనే భయంతో ఆయనను మారుస్తున్నారని అపోహలు సష్టిస్తున్నారని చెప్పారు._నియోజకవర్గ టిడిపి నాయకులు రోషన్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని, భారీ మెజార్టీపై తామంతా దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎత్తుకు పైఎత్తులు సహజ మేనని, కావాలని కొందరు పని గట్టుకుని రోషన్ కుమార్‌ను మారుస్తున్నారని అబద్ధపు వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎన్నికల్లో రోషన్ అఖండ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైసిపి నూతన ఇన్‌ఛార్జిగా ఆంజనేయులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వైసిపి కార్యాలయంలో ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు ఆధ్వర్యంలో 19వ వార్డు నూతన ఇన్‌ఛార్జిగా పైడి ఆంజనేయులు(రాయల్ బుజ్జి)ని నియమించారు. వార్డు వైసిపి అధ్యక్షులుగా బలభద్ర బాల్‌రెడ్డియ్య, వార్డు జెసిఎస్ ఇన్‌ఛార్జిగా రేలంగి శ్రీనివాస్‌ని నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పాలకొల్లు పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, జెసిఎస్ కన్వీనర్ మోర్త గిరీష్ పాల్గొన్నారు.

పల్లెపాలెంలో జాతర మహోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ళ

కలవపూడి పల్లెపాలెం గ్రామ దేవతలైన మారెమ్మ, మహాలక్ష్మమ్మల జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉండి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి కలవపూడి శివ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గరగలను ఎత్తుకొని జాతరను ప్రారంభించారు. ఈ జాతర 11 రోజుల పాటు అన్ని గ్రామాల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. మాజీ సర్పంచి తిరుమాని మద్రాజు, మాజీ ఎంపిటిసి బస్వాని వడ్డికాసులు, బర్రె కనకరాజు పాల్గొన్నారు.

చైతన్య యువజన అభ్యర్థిగా వెంకట స్వామి

ప్రజాశక్తి - నరసాపురం

భారత చైతన్య యువజన పార్టీ నరసాపురం అసెంబ్లీ అభ్యర్థిగా ఆకుల వెంకట స్వామి పేరు ప్రకటించారు. ఆ పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ మొదటి జాబితాలో వెంకట స్వామికి టిక్కెట్ కేటాయించారు. గతంలో జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులుగా, నరసాపురం పార్లమెంటరీ కో ఆర్డినేటర్‌గా పనిచేశారు. అనంతరం పార్టీలో నచ్చక ఆయన రాజీనామా చేశారు. నరసాపురంలో కౌన్సిలర్, న్యాయవాదిగా పనిచేశారు. ఈయన కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఎంపిడిఒ ఎస్ఎస్ఎస్.శర్మ



అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రభాకర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఎస్ఎస్ఎస్.శర్మ సూచించారు. మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో బుధవారం ఓటర్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు, స్థానికులకు బుర్ర కథ ద్వారా ఓటు ప్రాముఖ్యతను వివరించారు. నోడల్ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటుకు నోటు అనే ప్రలోభాలు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు సుమలత, థామస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

వినియోగదారుల సంఘం కార్యదర్శి గోపాలకృష్ణంరాజు


ప్రజాశక్తి - ఉండి

రైతులు ధాన్యం పట్టుబడికి కావాల్సిన గోనెసంచులను అందుబాటులో ఉంచాలని అధికారులకు యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్.గోపాలకృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రబీ సీజన్‌లో వరి దిగుబడులు అధికంగా వచ్చే అవకాశం ఉందని రైతులకు ధాన్యం పట్టుబడులకు ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాలలో గోనె సంచులను అధికారులు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. ధాన్యం కొనుగోళ్లకు హద్దులు పెట్టకుండా, పండిన పూర్తి ధాన్యాన్ని, ప్రతి గింజను కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం పట్టుబడి అనంతరం రవాణా ఏర్పాట్లను వేగవంతం చేసి రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులను విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - వీరవాసరం

దళితురాలిని అనే కారణంగా తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నవుడూరు గ్రామానికి చెందిన బొట్టా సుజాత బుధవారం మీడియా ముందు తన బాధను చెప్పుకుంది. ఆమె తెలిపిన వివారాల ప్రకారం దళితురాలైన సుజాతకు నలభై సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన శెట్టిబలిజ కులానికి చెందిన బొట్టా గంగాధర్ భగవత్‌తో ప్రేమ వివాహం జరిగింది. తమకు ముగ్గురు సంతానం అని తెలిపింది. ఈ నేపథ్యంలోనే నాటి నుంచి నేటి వరకు తన భర్త బంధువుల నుంచి వేధింపులకు గురవుతున్నట్టు తెలిపింది. తమ మధ్య భర్త కుటుంబ సభ్యులు కతలతలు సృష్టించి గతంలో తన భర్తకు వేరే మహిలతో వివాహం జరిపించడం జరిగిందన్నారు. అయినా తన భర్త బంధువులు నుంచి వేధింపులు ఆగలేదన్నారు. ఈ క్రమంలో ఈనెల 6వ తేదిన తనపై హత్యాప్రయత్నం చేయడం జరిగిందన్నారు. వారి దాడి నుంచి తప్పించుకున్న తాను ఆసుపత్రిలో వైద్యం పొందుతుండగా ఇంటిలోని బంగారు వస్తువులతో సహా మొత్తం సామానులు తగల బెట్టడం జరిగిందని తెలిపింది. కట్టుకోవడానికి చీర కూడా లేదని కన్నీటి పర్యంతమైంది. తనపై దాడి చేసిన తనభర్త కుటుంబ సభ్యులు, బంధువులైన బొట్టా లోకేష్, బొట్టా వెంకటకృష్ణ, బొట్టా చంద్రశేఖర్, బొట్టా సత్యవతి, బొట్టా గంగాభవాని, బొట్టా కరుణ, బొట్టా సుజాత, విజయకుమార్, లీల, జ్యోతిక, ప్రవల్లికలపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతుంది.


నివాళులర్పిస్తున్న హోమియో వైద్యులు

నరసాపురంలో శామ్యూల్ హానిమన్ జయంతి

ప్రజాశక్తి - నరసాపురం

హోమియోపతి వైద్య విధానాన్ని కనుగొన్న మహనీయుడు డాక్టర్ శ్యామ్యుల్ హానిమన్ 269వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్ఒ ఆఫీస్ వద్దనున్న హానిమన్ విగ్రహానికి పశ్చిమ గోదావరి జిల్లా హోమియో వైద్య సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శిరిగినీడి రమేష్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి కేవలం లక్షణ సముదాయాన్ని బట్టి ఎటువంటి వైద్య పరీక్షలు లేకుండా సత్వర నివారణ జరిగే వైద్యం హోమియో వైద్యం అన్నారు. కార్యదర్శి డాక్టర్ పల్లా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం హోమియో వైద్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, డాక్టర్ పావని, డాక్టర్ స్వామి, డాక్టర్ సందీప్, డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ కిరణ్, సహాయ కార్యదర్శి డాక్టర్ జాన్ హెన్రీ, మండెల శ్రీరామచంద్ర మూర్తి, శిరిగినీడి భవానీ శంకర్, శిరిగినీడి ఉమ పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని చామకూరి పాలెం మోడి గ్రామంలో 50 మంది జనసేన, టిడిపి పార్టీల నుంచి వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బొక్కా రాధాకృష్ణ, గుబ్బల రాధ కృష్ణ, దొంగ మురళీ కృష్ణ, తిరుమాని నాగరాజు పాల్గొన్నారు.

ఉడుకుతున్న 'ఉండి'..!

(మొదటి పేజీ నుంచి)

ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయితే నాటి నుంచి ఈ తాజా, మాజీ ఎంఎల్ఎల మధ్య వైరం ఏర్పడింది. అయితే ప్రస్తుత ఎన్నికల్లో శివరామరాజు ఉండి ఎంఎల్ఎ టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు టిడిపి అధిష్టానం మొదటి జాబితాలోనే టిక్కెట్ ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఇరువురి మధ్య మరింత దూరం పెరిగింది. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా శివరామరాజు, టిడిపి అభ్యర్థిగా రామరాజు నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. అయితే నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు నరసాపురం ఎంపీ టిక్కెట్ దక్కకపోవడంతో ఉండి నుంచి పోటీ చేస్తారని ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో పాలకొల్లులో రఘురామకృష్ణంరాజు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి నుంచి ఉండి టిక్కెట్ రఘురామకృష్ణంరాజుకు ఖరారు చేసినట్లు విస్తత ప్రచారం సాగింది. అయితే సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు, ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజును చంద్రబాబు హైదరాబాద్ పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడటంతో ఈ ప్రచారంతో బలం చేకూరింది. పొత్తులో భాగంగా త్యాగాలు తప్పవని టిక్కెట్ వదులుకోవాలంటూ రామరాజుకు చంద్రబాబు తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన, బిజెపి ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం పెదఅమిరంలో నిర్వహించారు. తెలుగు తమ్ముళ్లతోపాటు జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు కూడా ఎంఎల్ఎ రామరాజుకు అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ రామరాజు, ఆయన సోదరుడు నరసింహారాజు సైతం మొదటి జాబితాలో టిక్కెట్ కేటాయించి, ఇప్పుడు టిక్కెట్ త్యాగం చేయమంటే ఎలా అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో ఉండి నియోజకవర్గంలో టిడిపిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. టిడిపి అధిష్టానం తీరుపై అంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రామరాజు రాజకీయ ప్రయాణంపై సర్వత్రా చర్చ

సిట్టింగ్ ఎంఎల్ఎ రామరాజు రాజకీయ ప్రయాణంపై సర్వత్రా చర్చ సాగుతోంది. టిక్కెట్ మార్పు ఖాయమనే వార్తల నేపథ్యంలో ఆయన ఎటువైపు ప్రయాణిస్తారనేది అందరిలో ఆసక్తి రేపుతుంది. తాను రాజకీయాల్లో కొనసాగాలో లేక విరమించుకోవాలో అనేది కుటుంబ సభ్యులతో ఆలోచించి చెబుతాననడం కలకలం రేపుతోంది. రామరాజును స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని అనుచరులు కోరుతున్నట్లు సమాచారం. అయితే టిడిపి అధికారంలోకి వస్తే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని వెనక్కి తగ్గుతున్నట్లు తెలిసింది. మరోవైపు వైసిపి కూడా ఎంఎల్ఎ రామరాజు టచ్‌లోకి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది.

తణుకు సభకు ఎంఎల్ఎ రామరాజు దూరం

తణుకులో బుధవారం నిర్వహించిన ప్రజాగళం సభకు టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ విచ్చేసినా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు దూరంగా ఉన్నారు. ఉదయం నుంచి ఆయన పార్టీ కార్యాలయానికే పరిమితమయ్యారు.

1400 మంది తెలుగు తమ్ముళ్లు రాజీనామా

కాళ్ల: సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు టిక్కెట్ రద్దు చేస్తున్నారనే ప్రచారంతో కలత చెందిన నాలుగు మండలాలకు చెందిన సుమారు 1400 మంది తెలుగు తమ్ముళ్లు బుధవారం పార్టీకి రాజీనామాలు చేశారు. వీరిలో గ్రామ పార్టీ కమిటీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు, యూనిట్ ఇన్‌ఛార్జీలు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, నలుగురు పార్టీ మండల అధ్యక్షులతోపాటు మరికొంతమంది నాయకులు కార్యకర్తలు రాజీనామాలు చేశారు. 40 పేజీల రాజీనామా పత్రాలను టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మికి అందజేశారు.

ఎన్నికల కార్యాలయం ప్రారంభించిన రఘురామకృష్ణంరాజు

ఉండి టిడిపి టిక్కెట్ రఘురామకృష్ణంరాజుకు కేటాయించారని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఆయన ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించడం మరింత ఆసక్తికరంగా మారింది. బుధవారం ఉదయం పెదఅమిరంలో హడావిడిగా ఎన్నికల కార్యాలయాన్ని రఘురామకృష్ణంరాజు ప్రారంభించడం గమనార్హం. దీంతో ఉండి టిడిపి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజు పేరును రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

అవినీతి మంత్రికి బుద్ధి చెప్పండి

(మొదటి పేజీ నుంచి)

మాట్లాడడం తన స్థాయికి తగదని, అహంకారంతో రైతులను బూతులు తిడతాడని, ఇలాంటి మంత్రిని రాబోయే ఎన్నికల్లో గోస్తనీలో కలిపేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ అన్నారు. రాష్ట్రం బాగుండాలనే తాము కలిసి పోటీ చేస్తున్నామన్నారు. తణుకులో జనసేన అభ్యర్థిని ప్రకటించాక కూడా తగ్గాల్సి వచ్చిందన్నారు. అన్నయ్య నాగబాబుకు అనకాపల్లి ఎంపీ సీటు కేటాయించిన తర్వాత పొత్తులో భాగంగా తగ్గక తప్పలేదన్నారు. రైతులు బాగుండాలి బాధపడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మంత్రి దోచుకున్న సొమ్మును హైదరాబాద్‌లో పెడుతున్నారన్నారు. తణుకులో ఒక్క పరిశ్రమ పెట్టలేదన్నారు. మంత్రి, ఆయన కొడుకు దోపిడీ గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. జనసైనికుల జోలికి వస్తే ఈ మంత్రిని విడిచిపెట్టనన్నారు. తణుకులోని ప్రభుత్వాసుపత్రికి ఇవ్వాల్సిన రూ.రెండు కోట్ల బకాయిలు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, టిడిపిలో చేరిన నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు, టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ, జనసేన నాయకులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

అసంతృప్త నేత విడివాడ అనుచరుల ఆందోళన

జనసేన అభ్యర్థిగా విడివాడ రామచంద్రరావుకు టిక్కెట్ ఇవ్వలేదని ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్న సంగతి తెలిసిందే. తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన ఉమ్మడి సభ ఏర్పాట్లకు వచ్చిన జనసేన నేత నాదెండ్ల మనోహర్ ఎదుట గతంలో నిరసన గళం విప్పారు. ఇప్పుడు మరోసారి తణుకు పవన్‌కళ్యాణ్ రానుండడంతో మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో విడివాడ అనుచరులు 50 మంది నరేంద్ర సెంటర్‌లోని సభా ప్రాంగణం వద్ద ఆందోళన చేశారు. టిక్కెట్ విడివాడకు ఇస్తామని చెప్పి మాట ఎందుకు మార్చారని నినదించారు. ఆ తర్వాత కొంతసేపు ఆందోళన చేసి అక్కడినుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత గంటకు పవన్‌కళ్యాణ్, చంద్రబాబు సభా ప్రాంగణానికి విచ్చేశారు.

కృష్ణా నీటిని తాగునీటికే వినియోగించాలి

(మొదటి పేజీ నుంచి)


భీమడోలు మండలంలో ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో మంచినీటి చెరువులకు గోదావరి నీటిని విడుదల చేశారన్నారు. ఈ నీరు చేపల చెరువులకు మళ్లించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి కొరత, తాగునీటి ఎద్దడి ఉంటే 9100121271 ఫోన్ నెంబరుకు తెలియజేయవచ్చన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎన్.సత్యనారాయణ, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఇరిగేషన్, మత్స్య తదితర శాఖల అధికారులు ఉన్నారు.

భీమవరం జిల్లాలో స్పెషల్ జనరల్ అబ్జర్వర్ మిశ్రా పర్యటన


కలెక్టర్, ఎస్‌పిలతో మాట్లాడుతున్న రామ్మోహన్ మిశ్రా

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్మోహన్ మిశ్రా బుధవారం పర్యటించారు. స్థానిక కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమిత్‌కుమార్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులకు సంబంధించి వివరాలు కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు చేరవేయడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ చెప్పారు. సోషల్ మీడియాకు సంబంధించి ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్ మాధ్యమాల్లో వచ్చే రాజకీయపరమైన ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సి.విజిల్ పర్యవేక్షక విభాగాన్ని పరిశీలించారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు, ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీంలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జిపిఎస్ విధానం ద్వారా ఆయా వాహనాలు ఎక్కడ ఉన్నది, ఆయా నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి అజిత వేజెండ్ల, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, వివిధ శాఖలు జిల్లా అధికారులు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.


చెక్‌పోస్టు వద్ద రికార్డులు తనిఖీ చేస్తున్న రామ్మోహన్‌మిశ్రా

చెక్‌పోస్టుల్లో పక్కాగా తనిఖీలు చేపట్టాలి

భీమవరం రూరల్ : సరిహద్దు చెక్ పోస్టుల్లో తనిఖీలు పక్కాగా చేపట్టాలని, 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా ఆదేశించారు. మండలంలో లోసరి వద్ద సరిహద్దు చెక్ పోస్టును ఆయన బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌కి దిశా నిర్దేశం చేశారు. నగదు, మద్యం, తదితర పట్టుకున్న వాటిని పక్కాగా నమోదు చేయాలన్నారు. తనిఖీల ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా నగదు, మద్యం, విలువైన బహుమతులు, తదితర వాటిని తరలిస్తే సీజ్ చేసి, ఖజానాలో భద్రపరిచేందుకు సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. సీజ్ చేసిన నగదు, వస్తువులకు సరైన రశీదు అందించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి ప్రలోభాలకు తావు లేకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన నిరంతర నిఘా ఉంచాలని ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు బాబ్జి పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని పడాల గ్రామానికి చెందిన తన్నేడి నరసింహమూర్తి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులును టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) బుధవారం పరామర్శించారు. నరసింహమూర్తి కుటుంబసభ్యులకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఆయనతో పాటు టిడిపి మండలాధ్యక్షులు పరిమి రవికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ, టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముప్పిడి రమేష్ ఉన్నారు. అనంతరం పెంటపాడు మండలం కె.పెంటపాడు గ్రామానికి చెందిన బంగారి రాంబాబు తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను, ఆకుతీగపాడు గ్రామం టిడిపి రావిగుంట కార్యకర్త, వార్డు మెంబర్ పెంకి సోమేశ్వరావు భార్య సుగుణమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శ్రీరంగనాధరాజుకు పలువురి మద్దతు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వైసిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి శ్రీరంగనాధరాజును మండలంలోని మార్టేరు ఎస్‌సి కాలనీకి చెందిన పలువురు మహిళలు, నాయకులు బుధవారం కలిసి సంఘీభావం తెలిపారు. పెనుమంట్ర జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, మార్టేరు సర్పంచి మాట్టా కుమారి రాము, వైసిపి సీనియర్ నాయకులు కర్రి వేణుబాబు నాయకత్వం వహించారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని వెలగలేరు గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారులు సుమారు 50 మంది వైసిపిలో చేరారు. వారికి వైసిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

టిడిపిలో చేరిక

పెనుమంట్ర :మండలంలోని వెలగలేరు గ్రామానికి చెందిన 11 మంది వైసిపి నాయకులు టిడిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ సమక్షంలో బుధవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి పాలనలో అభివృద్ధి లేదని, ఉద్యోగాలు లేక యువత డీలా పడిందనివిమర్శించారు.

కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు అభినందనీయం

రోటరీ క్లబ్ పూర్వ గవర్నర్ దామోదరరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

సుందరయ్య కాలనీలో ఏర్పాటు చేయనున్న కుట్టు శిక్షణ కేంద్రానికి ఏలూరు రోటరీ క్లబ్ వారు నాలుగు కుట్టు మిషన్లు అందించారు. స్థానిక కృష్ణ రెసిడెన్సీ ఫంక్షన్ హాలులో అధ్యక్షులు రొటేరియన్ నేలపాటి రోహిత్ అధ్యక్షతన నిర్వహించిన రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు (రోటరీ జిల్లా 3020) సమావేశంలో కుట్టుమిషన్లు అందించారు. ఈ సందర్భంగా రోటరీ పూర్వ గవర్నర్ డాక్టర్ పి.దామోదరరెడ్డి మాట్లాడుతూ సుందరయ్య కాలనీలో హేలాపురి బాలోత్సవం, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా కార్మిక పేద కుటుంబాల మహిళలకు కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. కాలనీలో ఉన్న మహిళలందరూ కుట్టులో నైపుణ్యాన్ని ఏర్పాటు చేసుకోవడం ఉపయోగకరమైన విషయమన్నారు. రోటరీ క్లబ్ ఏలూరు అధ్యక్షులు నేలపాటి రోహిత్ మాట్లాడుతూ కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటుకు తన సహకారం కోరిన కమిటీ వారికి నాలుగు కుట్టు మిషన్లు అందించగలగడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ త్వరలో సుందరయ్య కాలనీలో కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభిస్తామని, రొటరీ క్లబ్ సభ్యులంతా హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కె.హేమంత్‌కుమార్, ఎన్.జగదీశన్, వి.నాగమణి ప్రియ, ఎస్ఎస్ఆర్‌కె.ప్రసాద్, పి.కొండలరావు, మహిళలు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సంక్షేమ పథకాలే గెలుపునకు బాటలు

వైసిపి ఎంపీ అభ్యర్థి ఉమాబాల, ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్


ప్రచారం చేస్తున్న ఉమాబాల, పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఐదేళ్లపాటు వైసిపి ప్రభుత్వ హయాంలో అందించిన సంక్షేమ పథకాలే తమ గెలుపునకు బాటలు వేస్తాయని ఆ పార్టీ నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బివి.రాజు కళాశాల సమీపన ప్రారంభమైన ర్యాలీ గొల్లలకోడేరు, గరగపర్రు, మైప, కోరుకొల్లు, మొగల్లు, పాలకోడేరు, వేంద్ర, వేంద్ర అగ్రహారం, కొండేపూడి మీదుగా శృంగవృక్షం, పెన్నాడ అగ్రహారం, గొరగనముడి, విస్సాకోడేరు, భీమవరం మీదుగా కుమదవల్లి వరకు సాగింది. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. తమకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజు (రామం), క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజానరేంద్రకుమార్, సర్పంచుల ఛాంబర్ మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణమరాజు, బొల్ల శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, కో-ఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత, ఎంపిటిసి సభ్యులు నరేష్, ఆదాడ లక్ష్మీతులసి, పాల జ్యోతి, శాంత కుమారి, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, సర్పంచులు పాల్గొన్నారు.

పన్నులు ముందుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పురపాలక సంఘ పరిధిలో 2024-25వ ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నులు ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించినవారికి ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనరు డాక్టర్ ఎ.శామ్యూల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో గాని, పురసేవ యాప్ (ఆన్ లైన్ సర్వీసు) ద్వారా గాని, ఆయా సచివాలయాల వద్ద చెల్లించవచ్చని చెప్పారు. ఈ నెల 30వ తేదీ లోపు ముందస్తుగా పన్నులు చెల్లించి ఐదు శాతం పన్ను రాయితీ పొందాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనరు డాక్టర్ ఎ.శామ్యూల్ తెలిపారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. ప్రజల పాట్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, వీస్తున్న వడగాల్పులతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఉదయం పది గంటలకే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 12 గంటలకు వడగాల్పులు తోడవుతున్నాయి. దీంతో కార్మికులు పనిలో ఆపసోపాలు పడుతున్నారు. సైకిల్‌పై వివిధ వ్యాపారాలు చేసే వారు, తోపుడు బండ్ల వారు ఎండకు మాడుతున్నారు. వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ, వడగాల్పులకు భయపడి బయటకు రావడంలేదు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

ప్రజాశక్తి - నరసాపురం

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యమని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కరకృష్ణప్రసాద్ (బుజ్జి) అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలను బుజ్జి బుధవారం కలిసి వారి మద్దతు కోరారు. రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకే ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి శ్రీనివాస్, గుబ్బల కృష్ణారావు, సోడదాసి శ్రీధర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

తనను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసేందుక సిద్ధంగా ఉన్నానని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని చామకూరిపాలెంలో బుధవారం ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ప్రసాదరాజు పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసిన అభివృద్ధి చూసి ఓటేయలన్నారు. ఈ కార్యక్రమంలో వేండ్ర వెంకటస్వామి, తిరుమాని నాగరాజు, గుబ్బల రాధాకృష్ణ, బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ, కడలి రాంబాబు పాల్గొన్నారు.

మండలంలోని మల్లవరం లంక గ్రామంలో గురువారం ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని వైసిపి మండలాధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ తెలిపారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక పాతూరులోని పెద్ద మసీదులో రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు పాతూరు యూత్ మిత్రులు, జువ్వలపాలెం యూత్ మిత్రులు ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలూరి సాయికృష్ణ, నక్క వాసు, బుద్ధన రాము, పాతూరు యూత్ తరపున దాట్ల జగన్నాథరాజు, సుంకర ధనబాబు, నీలం సురేష్, పుప్పాల శివాజీ, శ్రీరామ్ నాగేశ్వరరావు, కొత్తపల్లి శ్రీనివాస్, చామనకిరణ్, ముస్లిం పెద్దలు రఫాత్, సత్తాజ్, ముస్లిం యూత్ వల్లి, బాషా పాల్గొన్నారు.

'నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేసేందుకు కృషి చేస్తా'

ప్రజాశక్తి - నరసాపురం

బిసివైపి అధికారంలోకి వచ్చిన వెంటనే నరసాపురం జిల్లా కేంద్రం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆకుల వెంకటస్వామి అన్నారు. నరసాపురంలో టిడిపి కూటమి తనకు పోటీయే కాదని, ప్రధాన పోటీ వైసిపికి, బిసివైసికి మధ్య ఉంటుందని అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థులు స్థానికేతరులని, తాను స్థానికుడని అవ్వడం వల్ల నియోజకవర్గ ప్రజానీకమంతా రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీలో గెలిపిస్తారన్నారు.

రామరాజు అభ్యర్థిత్వాన్ని కొనసాగించాలని దీక్షలు


ప్రజాశక్తి - ఉండి

టిడిపికి కంచుకోటైన ఉండి నియోజకవర్గంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం జెండా ఎగరవేయాలంటే ఎంఎల్ఎ అభ్యర్థిగా మంతెన రామరాజును కొనసాగించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయ ప్రాంగణంలో మంతెన రామరాజు టిక్కెట్ కొనసాగించాలని చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలో జుత్తిగ శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు, యండగండి యూనిట్ ఇన్‌ఛార్జి కాలా గణేష్ కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పాలకొల్లులో ఆందోళన చేపట్టినా చంద్రబాబు పట్టించుకోకుండా వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక ఆమరణ నిరాహారదీక్ష చేపట్టామన్నారు. ఈ దీక్షలకు టిడిపి నేతలు కరిమెరక నాగరాజు, గుండాబత్తుల నాగేశ్వరరావు, దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, పిన్నమరాజు శ్రీనివాసరాజు, అడ్డాల శివరామరాజు, కిన్నెర వెంకన్న, కాగిత మహంకాళి తదితరులు సంఘీభావం తెలిపారు.

సీడ్ మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎన్నికల క మిషన్ చొరవ చూపి సీడ్ మొక్కజొన్న రై తులను ఆదుకునేలా వ్యవసాయ అధి కారులకు ఆదే శాలు ఇవ్వాలని రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు నిమ్మ గడ్డ నరసింహ, గంటా పాపారావు కో రారు. మం డలంలోని ఎం ఎన్.పాలెంలో నష్టపోయిన సీడ్ మొక్కజొన్న రైతాంగాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ రైతులను అనేక సీడ్ మొక్కజొన్న కంపెనీలు మోసం చేశాయని తెలిపారు. రైతులను ఆదుకోవాలంటే ఎన్నికల కమిషన్ చొరవ చూపాలని, వ్యవసాయాధికారులకు తగిన సూచనలు ఇచ్చి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న నాయకులు


సునీల్‌కు అభినందనలు తెలుపుతున్న పిహెచ్‌సి సిబ్బంది

కాళ్ల వైద్యాధికారిగా సరాబు సునీల్

ప్రజాశక్తి - కాళ్ల

మండల సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ సరాబు సునీల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బంది, వైద్యులు సరాబు సునీల్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆర్యోగ కేంద్రంతో పాటు ఉప కేంద్రాల్లో సైతం సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, పిహెచ్‌సిలో ఒఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ఇవిఎం వినియోగంపై శిక్షణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గ సెక్టోరల్ అధికారులకు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇవిఎం కమిషనింగ్‌పై అవగాహన కల్పించారు. ఇవిఎంలో బ్యాలెట్ పత్రాలు ఎలా పొందుపరచాలి, ఎలా వినియోగించాలన్ని అంశాలపై ఇవిఎం యంత్రాలతో మాక్ ట్రైనింగ్ నిర్వహించారు. ఆర్‌ఒ ఖాజావలీ, ట్రైనీ సంయుక్త కలెక్టర్ భానుశ్రీ, నాలుగు మండలాల ఎఇఆర్‌ఒలు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు మూసివేత దారుణం

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు శివారు కొత్తూరు జ్యూట్‌మిల్లు కొన్నిరోజులుగా లాకౌట్‌లో ఉందని, మిల్లును మూసివేసేందుకు యాజమాన్యం రంగం సిద్ధం చేస్తుందని, దీంతో రెండు వేల మందికి పైగా కార్మికులు నష్టపోతారని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఏలూరు జ్యూట్‌మిల్లు మూసివేతతో రెండు వేల మందికి పైగా కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. కొత్తూరు జ్యూట్ మిల్లు కూడా మూసేస్తే మరో రెండు వేలమంది రోడ్డున పడతారన్నారు. ఏలూరు జ్యూట్‌మిల్లు మూసేసిన సమయంలో ఆళ్లనాని ఉపముఖ్యమంత్రిగా ఉన్నారని యాజమాన్యంతో మాట్లాడి అది మూతపడకుండా చేయలేకపోయారన్నారు. ఇప్పుడు కొత్తూరు జ్యూట్‌మిల్లు విషయంలోనైనా యాజమాన్యంతో మాట్లాడి మిల్లును మూతపడకుండా చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఇబి అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఇబి ఎస్‌పి ఎన్‌విఎస్.మూర్తి



మాట్లాడుతున్న ఎస్‌పి ఎన్‌విఎస్.మూర్తి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది ఎంతో చాకచక్యంగా వ్యవహరించి అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తిగా నిలువరించాలని స్పెషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌పి ఎన్‌విఎస్.మూర్తి అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లావ్యాప్తంగా ఉన్న బ్యూరో అధికారులతో, సిబ్బందితో మంగళగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌పిగా పని చేస్తున్న ఎన్‌విఎస్.మూర్తి బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సలహాలు, సూచనలు అందించారు. అంతేకాకుండా ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద ఎప్పటికప్పుడు ఆకస్మిక ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఉండాలని ఆయన సూచించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ద్వారా ఇప్పటివరకు ఎన్నికల నేపథ్యంలో సీజ్ చేసిన వాహనాలు, మద్యం, చెక్‌పోస్టుల నిర్వహణ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, డిఎస్‌పి జనార్ధన్‌నాయుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గణపతిరావు, ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా అదనపు వైద్యాధికారి భానునాయక్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జగనన్న ఆరోగ్య శిబిరం వద్ద గర్భిణులకు కూడా మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి భానునాయక్ చెప్పారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో భగ్గేశ్వరం సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి డాక్టర్ లీనాసుప్రియ, డాక్టర్ గంగాభవానిలను అడిగి తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు, ఎఎన్ఎంలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రాధాన్యతపై పలు సూచనలు చేశారు. ప్రజలకు ఈ వైద్య శిబిరంపై అవగాహన అవగాహన కల్పించాలన్నారు. బిపి, షుగర్ పేషెంట్లు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి పరీక్షలు చేసి వైద్య సేవలందించేలా చూడాలన్నారు. టిబి లక్షణాలు గల వారిని గుర్తించి వారికి పరీక్షలు చేసి మందులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, సిహెచ్‌ఒ ఎస్‌కె.ఆంజనేయుడు, హెల్త్ సూపర్‌వైజర్ డి.కమల, ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి, ఎఎన్ఎం భారతి, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న భానునాయక్

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆచంట రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల విధులు నిర్వహించే పిఒ, ఎపిఒలకు స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు గురికాకుండా వివాదారహితంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల లోపలికి ఎలాంటి ఆయుధాలు, సెల్‌ఫోన్లు తీసువెళ్లకూడదన్నారు. పోలింగ్ ఆలస్యంగా ప్రారంభించినప్పటికీ నిర్ణీత సమయంలో మూసివేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 220 మంది తరగతుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఐపి శెట్టి, ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్, పెనుమంట్ర తహశీల్దార్ లక్ష్మీకళ్యాణి, డిప్యూటీ తహశీల్దార్లు రాంప్రసాద్ రాజు, సుగుణ సంధ్య, ఆర్ఐ జయలలిత, నాగిరెడ్డి, జి.నరసింహరావు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఆర్‌డిఒ

నరసాపురం : ఎన్నికలు పూర్తయ్యేంతవరకు అధికారులు సమన్వయంతో పని చేయాలని నరసాపురం ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్ అన్నారు. పట్టణంలోని వైఎన్ కళాశా లలో పిఒలు, ఎఒలకు బుధ వారం శిక్షణ తరగతులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. పోలింగ్ నిర్వహణ ఏ విధంగా చేపట్టాలో అవగాహన కల్పించారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాములు ఏర్పాటు చేయాలని, ఏమైనా లోటుపాట్లు ఉంటే రిటర్నింగ్ అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ ఎం.అనుపమ, ఇఒపిఆర్‌డి హైమావతి ఆధ్వర్యంలో ఓటర్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కళాకారులతో కళా రూపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటర్లలో చైతన్యం కలిగించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అనుపమ కోరారు. ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఓటర్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఓటు వినియోగించుకునే ఆసక్తి పెరుగుతుందని అక్కడకు విచ్చేసిన ఓటర్లు తెలిపారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పొలసానిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన వాలంటీర్లు బుధవారం రాజీనామాలు చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను గ్రామపంచాయతీ కార్యదర్శికి అందిందించారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఒకటి, మూడు వార్డులకు చెందిన 14 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి అందించారు.

ముసునూరు : మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వాలంటీర్లందరూ రాజీనామా చేశారని ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి తెలిపారు.

నరసాపురం : మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో 11 మంది వాలంటీర్లు రాజీనామా చేశారని ఎంపిడిఒ ఎంవి.రమణారావు తెలిపారు. చిట్టవరం, మల్లవరం, చామకూరిపాలెం గ్రామ పంచాయతీలో మొత్తం 11 మంది రాజీనామా చేశారన్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఆయా గ్రామ కార్యదర్శులు అందించినట్లు ఎంపిడిఒ తెలిపారు.


నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రూ.1.30 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.30 లక్షల నగదును ఎస్ఎస్‌టి టీం స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. మండలంలోని అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టి టీమ్ బుధవారం తనిఖీలు చేస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.30 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ఏలూరులోని జిల్లా ట్రెజరరీకి పంపినట్లు ఎస్-ఎస్‌టి సభ్యులు జారిన తెలిపారు.